
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

హైదరాబాద్
నగర వార్తలు
5
ఆదివారం 16 మార్చి 2025

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.4 కనిష్ఠం 23.3

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:32 (ఆదివారం సాయంత్రం)
సహర్: 5:01 (సోమవారం ఉదయం)

కూల్.. కూల్



నగరంలో సూరీడు భగ్గుమంటున్నాడు. ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో జూ లోని మూగ జీవాలు ఎండవేడిమికి అల్లాడుతున్నాయి. వాటికి ఉపశమనం కలిగించేలా చల్లదనం కోసం కూలర్లు, నీటి షవర్లు ఏర్పాటు చేశారు. పైప్‌తో నీటిని చల్లుతూ ఓ సింహాన్ని ఇలా వేసవి తాపం నుంచి చల్లబరుస్తున్నారు.



- ఫొటో : ఆంధ్రజ్యోతి స్పెషల్ ఫొటోగ్రాఫర్

ఒంటి పూట సందడి..



సరూర్‌నగర్‌లో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

నగరంలో శనివారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభమయ్యాయి. ఎండల వేడిమి నుంచి ఉపశమనం పొందుతూ విద్యార్థులు కేరింతలు కొడుతూ మధ్యాహానికే ఇంటికి చేరుకున్నారు.

ఒకే తరహాలో..

గ్రేటర్‌లో 247 ఎఫ్‌ఓసీ ఆటోలు

అన్నీ ఒకేలా ఉండేలా డిజైన్

ప్రతి ఆటోకూ జీపీఎస్ అనుసంధానం

ఎలక్ట్రిసిటీ కమాండ్ కంట్రోల్ రూం నుంచే పర్యవేక్షణ



ఎఫ్‌ఓసీ ఆటో

హైదరాబాద్ సిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో కరెంటోళ్ల ఆటోలు ఒకే తరహాలో రాబోతున్నాయి. ఇప్పటికే ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఆటోలు ఉన్నా అవి వివిధ తరహాల్లో ఉంటుండడంతో ఆ విధానానికి స్వస్తి పలుకుతూ ప్రజలు సులువుగా గుర్తించేలా ఒకే తరహాలో ఉండేలా వాటిని డిజైన్ చేశారు. బస్తీల్లో విద్యుత్ సమస్యలు ఏర్పడినపుడు సులువుగా అక్కడికి చేరుకునేలా ఈ ఫ్యూజ్ ఆఫ్ కాల్ (ఎఫ్ఓసీ) ఆటోలను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) అందుబాటులోకి తీసుకురాబోతుంది.

గ్రేటర్ 10 సర్కిళ్ల పరిధిలో 90 విద్యుత్ అంబులెన్స్ తరహాలో (టోల్ ఫ్రీ నంబర్:1912) వాహనాలు అందుబాటులోకి తెచ్చిన దక్షిణ డిస్కం, 247 సెక్షన్ల పరిధిలో అదే తరహాలో ప్రత్యేకంగా విద్యుత్‌శాఖ టోల్ ఫ్రీ నంబర్-1912 కనిపించేలా, దక్షిణ డిస్కం లోగోతో ఎఫ్ఓసీ ఆటోల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే ఆటోలకు వేయాల్సిన డిజైన్లకు డిస్కం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రతి ఎఫ్ఓసీ ఆటోకు జీపీఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం) అనుసంధానం చేయడంతో ఎఫ్ఓసీ ఆటో ఎక్కడ ఉంది..? ఫిర్యాదు చేసిన ప్రాంతానికి ఎన్ని నిమిషాల్లో చేరుకుందనే సమాచారం ఇటే తెలిసిపోతుంది. ఈ ఆటోలను టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలోని ఎలక్ట్రిసిటీ కమాండ్ కంట్రోల్ నుంచే పరిశీలించే అవకాశముంటుంది. దీంతో భారీవర్షాలు, ఇతర సమస్యలు తలెత్తినప్పుడు ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు,

మిగతా 6వ పేజీలో..

సర్కిళ్ల వారీగా ఎఫ్ఓసీలు..	
హబ్సిగూడ	28
బంజారాహిల్స్	14
మేడ్చల్	23
రాజేంద్రనగర్	25
సరూర్‌నగర్	24
సైబర్‌సిటీ	19
సికింద్రాబాద్	22
హైదరాబాద్ సెంట్రల్	29
హైదరాబాద్ సౌత్	25
సంగారెడ్డి	38

41 కి.మీ..

₹2,820 కోట్లు

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి అంచనా వ్యయం

రెండు ప్యాకేజీల్లో టెండర్ల ఆహ్వానం

రూ.1,282 కోట్లతో ఔటర్ రావిర్యాల నుంచి ఫ్యూచర్ సిటీకి..

రూ.1,538 కోట్లతో ఫ్యూచర్‌సిటీ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు పనులు

ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ సేవలకు సైతం టెండర్లు



గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నమూనా

హైదరాబాద్ సిటీ, మార్చి15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరానికి ఫ్యూచర్ సిటీకి లింకు చేసే ప్రధాన రహదారి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును రూ.2,820కోట్లతో చేపట్టనున్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు రావిర్యాల (టాటా ఇంటర్‌ఛేంజ్) నుంచి ఫ్యూచర్‌సిటీకి మీర్‌ఖాన్‌పేట మీదుగా ఆమన్‌గల్ రీజినల్ రింగ్‌రోడ్డు (రతన్‌టాటా రోడ్డు)వరకు 300 అడుగులతో 41.50కిలోమీటర్ల మేర రోడ్డును నిర్మించనున్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న ఈ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులను రెండు ప్యాకేజీల్లో చేపట్టేందుకు వేర్వేరుగా టెండర్లను ఆహ్వానించారు. ప్యాకేజీ -1లో రూ.1282కోట్లతో ఔటర్ రావిర్యాల (టాటా ఇంటర్‌ఛేంజ్) నుంచి ఫ్యూచర్‌సిటీ మీర్‌ఖాన్‌పేట వరకు 19.20కి.మీ. పనులు చేపట్టనుండగా.. ప్యాకేజీ-2లో రూ.1538కోట్లతో మీర్‌ఖాన్‌పేట నుంచి ఆమన్‌గల్ వద్ద రీజినల్ రింగ్‌రోడ్డు (రతన్‌టాటా రోడ్డు) వరకు 22.30కి.మీ. మేర పనులు చేపట్టడానికి టెండర్లను ఆహ్వానించారు. ఈ నెల 21వ తేదీ వరకు ఆసక్తిగల సంస్థలు టెండర్ల దాఖలుకు గడువునిచ్చారు. అయితే ఈ రెండు ప్యాకేజీల్లో చేపట్టే పనులను పర్యవేక్షించడానికి ప్రాజెక్టు మేనేజ్‌మెంట్

మిగతా 6వ పేజీలో..



సచివాలయం వద్ద డ్రోన్ ఎగురవేత

● కేసు నమోదు

ఖైరతాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నిషేధాజ్ఞలు అమలులో ఉండే తెలంగాణ సచివాలయం వద్ద డ్రోన్ ఎగురవేసిన వారిపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజులక్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంలో వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ పరమేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ ఆధ్వర్యంలో ఇటీవల తెలుగుతల్లి చౌరస్తాలో బ్యూటిఫికేషన్ పనులు జరిగాయి. తెలంగాణ, హైదరాబాద్ పేర్లతో పాటు తెలంగాణ మ్యాప్, ఆకర్షించే కుండలు, పచ్చికతో చేపట్టిన పనులు దాదాపు పూర్తయ్యాయి. పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ ఈ ఐలాండ్ బ్యూటిఫికేషన్‌ను వీడియో తీయించేందుకు ఓ ప్రైవేటు వ్యక్తిని సంప్రదించగా అతడు డ్రోన్ సహాయంతో రాత్రి వేళల్లో వీడియో తీశాడు. దీన్ని గమనించిన సచివాలయ భద్రతా విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ మూర్తి సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు డ్రోన్‌ను ఎగురవేసిన హిమాయత్‌నగర్‌కు చెందిన నాగరాజును విచారించారు. అయితే, కేసు నమోదై మూడు రోజులు గడచినా ఈ విషయాన్ని పోలీసులు బయటకు పొక్కనీయలేదు.

'యాసిడ్' కేసులో వీడిన మిస్టరీ?

ఆలయ అర్చకుడే సూత్రధారి!

పాత్రధారి మరో అర్చకుడు

పోలీసుల ఆదుపులో గురుశిష్యులు

సైదాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ భూలక్ష్మి ఆలయ అకౌంటెంట్ నర్సింగరావుపై శుక్రవారం రాత్రి జరిగిన యాసిడ్ దాడి కేసు మిస్టరీని పోలీసులు ఛేదించినట్లు తెలిసింది. ఘటనకు ప్రధాన సూత్రధారి ఆలయ అర్చకుడు కాగా.. పాత్రధారి మరో అర్చకుడిగా నిర్ధారించి అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. వివరాలిలా ఉన్నాయి. సైదాబాద్‌లోని భూలక్ష్మి ఆలయంలో నిత్యం జరిగే పూజా కార్యక్రమాలు, డబ్బులు వసూళ్లలో అకౌంటెంట్ నర్సింగ్‌రావు, అర్చకుడు రాజశేఖర్‌శర్మ మధ్య గతంలో వివాదాలున్నాయి. ఈ క్రమంలో అకౌంటెంట్ తరుచూ అర్చకుడిని దూషిస్తున్నట్లు సమాచారం. అయితే, నర్సింగ్‌రావుపై ప్రతీకారం తీర్చుకోవాలని రాజశేఖరశర్మ తలంచాడు. షేక్‌పేటలో పూజారిగా పని చేస్తున్న సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన రాయికోడ్ హరిపుత్ర(31)తో రాజశేఖరశర్మకు గురుశిష్యుల బంధం ఉంది. దీంతో హరిపుత్రతో కలిసి అకౌంటెంట్‌పై కుట్ర పన్నినట్లు తెలిసింది.

పట్టించిన యాసిడ్ డబ్బా..?

శుక్రవారం రాత్రి అకౌంటెంట్ నర్సింగ్‌రావుపై పూజారి హరిపుత్ర యాసిడ్ పోసి పారిపోతూ డబ్బాను ఆలయ ఆవరణలో వదిలేశాడు. ఇది గమనించిన రాజశేఖర్‌శర్మ సదరు డబ్బాను బయట పడవేయడం సీసీ ఫుటేజీలో రికార్డయింది. సీసీ ఫుటేజీలలో దీనిని గుర్తించిన ఈస్ట్ టాస్క్‌ఫోర్సు పోలీసులు అతడిని శనివారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకుని విచారించగా గుట్టురట్టయినట్లు తెలిసింది. అతడు తెలిపిన

మిగతా 14వ పేజీలో..



కట్టు తప్పితే.. కఠినచర్యలు

అధ్యాపకులు, విద్యార్థి ప్రతినిధులతో క్రమశిక్షణా కమిటీ ఏర్పాటు

విద్యార్థుల కోసం నూతన మార్గదర్శకాలు ● జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

14

నేర నియంత్రణలో ఆర్‌కేపీఎస్సీ కీలక పాత్ర

● రాచకొండ సీపీ సుధీర్‌బాబు





బీసీ నాయకత్వాన్ని కాపాడుకోవాలి

● మధుయాష్కీ గౌడ్



నీలాల కన్నులతో యువతను మత్తులోకి దింపేలా ఓర చూపులు చూస్తున్న బిగ్‌బాస్ ఫేం, సినీనటి దివి శనివారం మియాపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఫొటోలకు ఇలా పోజిచ్చారు. - మియాపూర్, మార్చి15 (ఆంధ్రజ్యోతి)

గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలి

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి



మాట్లాడుతున్న కమలాసన్‌రెడ్డి, ఖురేషీ

హైదరాబాద్ సిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేస్తున్న ఎస్‌టీఎఫ్ టీమ్‌ల పనితీరు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసన్‌రెడ్డి పేర్కొన్నారు. నాంపల్లిలోని ఆబ్కారీ భవన్‌లో శనివారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌టీఎఫ్ టీమ్‌లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు గంజాయి,డ్రగ్స్ ఎలా వస్తున్నాయనే విషయాలపై ఆరాతీసి అక్రమ రవాణా చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని అన్నారు. అలాగే ఎన్‌డీపీఎల్ (నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్) వినియోగంపై, ఆల్ప్రోజోలం వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ ఖురేషీ, అడిషనల్ ఎస్పీ భాస్కర్, అసిస్టెంట్ కమిషనర్ ప్రణవి, సీఐ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



రూ.1.15 లక్షలు హాంఫట్

● రివార్డు పాయింట్లు యాడ్ చేస్తామని బురిడీ

● క్రెడిట్ కార్డు నుంచి కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు రివార్డు పాయింట్లను నగదుగా మారుస్తామని ఓ యువకుడిని బురిడీ కొట్టించి రూ. 1.15లక్షలను సైబర్ నేరగాళ్లు కొట్టేశారు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన 29 ఏళ్ల యువకుడికి గుర్తుతెలియని వ్యక్తులు వాట్సాప్ కాల్ చేశారు. క్రె. కార్డు కంపెనీ ఉద్యోగులుగా పరిచయం చేసుకుని క్రెడిట్‌కార్డులోని రివార్డు పాయింట్లను నగదుగా మారుస్తామని నమ్మించారు. బాధితుడు సరే అనగానే లింకును పంపి అందులో కార్డు హోల్డర్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. బాధితుడు వివరాలను నమోదు చేసిన కొద్దిసేపటికే అతని క్రెడిట్ కార్డు నుంచి రూ. 1.15 లక్షలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. ఎలాంటి ఓటీపీ లేకుండా కార్డు నుంచి నగదు డెబిట్ కావడంతో షాకైన బాధితుడు లింకు పంపిన ఫోన్ నంబర్‌లలో సంప్రదించగా.. ఎవరూ స్పందించలేదు. దాంతో సైబర్ మోసానికి గురైనట్లు ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీఎస్టీ పరిచయం చరిత్రాత్మకం

● ఇది పన్నుల సంస్కరణ కంటే ఎక్కువ

● గవర్నర్ జిష్ణుదేవ్



సదస్సులో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వి.ఎన్.భట్టి, ముంబై హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీధరన్ తదితరులు

హైదరాబాద్ సిటీ, మార్చి15 (ఆంధ్రజ్యోతి): మన ఆర్థిక వ్యవస్థ చరిత్రలో జీఎస్టీ పరిచయం చారిత్రాత్మకమని, ఇది పన్నుల సంస్కరణ కంటే ఎక్కువని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. బంజారాహిల్స్‌లో శనివారం తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో 'జీఎస్టీలో సవాళ్లతో కూడిన సమయాల్లో కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ పాత్ర'పై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే పన్ను లక్ష్య సాకారాన్ని జీఎస్టీ సాధ్యం చేసిందన్నారు.

ఈ ప్రక్రియ అతి సులభంగా వ్యాపారం చేయడంతో పాటుగా పారదర్శకతను ప్రోత్సహించిందన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి మాట్లాడుతూ డీలర్‌కు అర్థమైనదేదో వారికి అందించడం, అలాగే ప్రభుత్వానికి సైతం అందించడం న్యాయవ్యవస్థ విధి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాంబే హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీధరన్, లక్ష్మీకుమరన్ సహ వ్యవస్థాపకులు వి.శ్రీధరన్, ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు డాక్టర్ సురేష్‌కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ఔన్నత్యాన్ని భావితరాలకు అందజేయాలి

రాజేంద్రనగర్: భారతీయ ప్రాచీన చరిత్రలో అనేక దేవాలయాల నిర్మాణం, ప్రాంతాల కనుగుణంగా చెరువులు, నదులు ఏర్పాటు చేశారని, వాటన్నింటిని సాక్ష్యాధారాలతో భావితరానికి అందించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఇతిహాస్ సంకలన్ సమితి(భారతీయ) తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ ట్రైనింగ్ సెంటర్‌లో మూడురోజుల పాటు నిర్వహిస్తున్న 'దక్షిణపథ త్రూ ద ఏజెస్ - గ్లోరీ ఆఫ్ భారత్' సెమినార్‌ను శనివారం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో పొందుపరచని అంశాలను సైతం గుర్తించి వాటిని దేశ చరిత్రలో పొందుపరిచే విధంగా చూడాల్సిన అవసరం

మిగతా 6వ పేజీలో..



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

ఎక్సైజ్ పోలీసుల దాడులు

● 23 బాటిళ్ల మద్యం స్వాధీనం

హైదరాబాద్ సిటీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అక్రమ మద్యంపై అందించిన సమాచారం మేరకు చేవెళ్ల, మేడిపల్లి, మొయినాబాద్ ప్రాంతాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మేడిపల్లి, మొయినాబాద్ పరిధిల్లో మొత్తంగా 23 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. చత్తీస్‌గఢ్ హర్యానా, ఢిల్లీ, గోవా ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్నట్లు గుర్తించారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

జీఎస్టీ పరిచయం చరిత్రాత్మకం

(5వ పేజీ తరువాయి)

ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ మాజీ చీఫ్ సెక్రటరీ ఎల్.వి సుబ్రమణ్యం, అఖిల భారత ఇతిహాస్ సంకలన్ యాత్ర జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బాల్‌ముకుంద్ పాండే, పాట్నా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎల్.నర్సింహారెడి, ఇతిహాస్ సంకలన్ సమితి(భారతీయ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వి.కిషన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ నిపుణులకు ఆత్మ ప్రశాంతత అవసరం

రాయదుర్గం: ధర్మాన్ని మనం కాపాడితే ధర్మం మనల్ని కాపాడుతుందని



జ్యోతిని వెలిగించి హెచ్‌ఏసీ-25ను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. గచ్చిబౌలిలోని ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్‌లో శనివారం నిర్వహించిన జాతీయ న్యా నిపుణుల సదస్సు ముగింపు కార్యక్రమంలో గవర్నర్ ప్రసంగించారు. న్యాయ నిపుణులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ ఉంటారని, వాటిని అధిగమించేందుకు ఆత్మ ప్రశాంతత ఎంతో అవసరమన్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకటనారాయణ భట్టి మాట్లాడుతూ బ్రహ్మకుమారీ సంస్థ సమాజంలో పాజిటివిటీని పెంపొందిస్తుందన్నారు. హైకోర్టు జస్టిస్ అమృతగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సేవ కోసం ఒక రోజు కేటాయించాలి

పేదల సేవ కోసం పదిహేను రోజులకు ఒకరోజును ప్రతి డాక్టరు కేటాయించాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ కోరారు. శనివారం బంజారాహిల్స్‌లో యశోద ఆస్పత్రి నిర్వహించిన హైదరాబాద్ ఆర్థ్రోస్కోపీ సదస్సును గవర్నర్ ప్రారంభించి మాట్లాడారు. యువత ఇటీవల క్రీడల వైపు మొగ్గు చూపుతున్నదని, అయితే, అదే సమయంలో క్రీడా సంబంధిత గాయాలు కూడా అత్యంత సాధారణమయ్యాయన్నారు. వైద్యం కోసం డబ్బు ఖర్చు చేయలేని పేదవారికోసం వైద్యులు ఒకరోజును కేటాయించాలన్నారు. యశోదా హాస్పిటల్స్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, సికింద్రాబాద్‌లో సీనియర్ స్పోర్ట్స్ ఆర్థోపెడిక్స్, ఆర్థ్రోస్కోపీ సర్జన్, హెచ్ఏసీ చైర్మన్ డాక్టర్ ఆర్ఎ పూర్ణచంద్ర తేజస్వి ప్రసంగించారు. యశదా ఆస్పత్రి ఎండి సురేందర్ రావు గోరుకంటి, ఐఏఏ సెక్రెటరీ డాక్టర్ రాజీవ్ రామన్ తదితరులు పాల్గొన్నారు.

అర్బన్ జిల్లాగా మేడ్చల్-మల్కాజిగిరి

● మూడు బల్దియాలకు ఆమోదం తెలిపిన మంత్రివర్గం

● ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే గ్రీన్‌సిగ్నల్!

మేడ్చల్ ప్రతినిధి, మార్చి15(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మిగిలిన 34 గ్రామ పంచాయతీల భవితవ్యంపై నెలకొన్న సందిగ్ధత ఎట్టకేలకు వీడింది. గతంలోనే 'ఆంధ్రజ్యోతి' చెప్పిన మాదిరిగానే జిల్లాలో మరో మూడు కొత్త మున్సిపాల్టీలు ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. 62 పంచాయతీలున్న మేడ్చల్ జిల్లాలో ఓఆర్ఆర్ సమీపంలోని 28 గ్రామాలను గతంలోనే మున్సిపాల్టీల్లో విలీనం చేసిన విషయం విదితమే. తాజాగా 34 గ్రామాలను మూడు మున్సిపాల్టీలుగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట, మూడుచింతలపల్లి, శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ కేంద్రంగా కొత్త మున్సిపాల్టీల ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపగా ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు ఆమోదం పొందనున్నట్లు సమాచారం. ఇప్పటికే జిల్లాలో 9 మున్సిపాల్టీలు 4 కార్పొరేషన్లు ఉన్నాయి.

34 గ్రామాలు మూడు మున్సిపాల్టీలు..

ఎల్లంపేట మున్సిపాలిటీలోకి ఎల్లంపేట, శ్రీరంగవరం, బండమాదారం, నూతన్‌కల్, మైసిరెడ్డిపల్లి, కొనాయిపల్లి, రావల్‌కోల్, కండ్లకోయ, రాజబొల్లారం, ఘనాపూర్, గోసాయిగూడ, అలియాబాద్, సోమారం, మున్సిపాలిటీలో అలియాబాద్, తుర్కపల్లి, లాల్‌ఘాడిమలక్‌పేట, మజీద్‌పూర్, మురారిపల్లి, యాడారం, పొన్నాల గ్రామాలు, మూడుచింతలపల్లి పరిధిలోకి లింగాపూర్, ఉద్దమర్రి, కేశవరం, నాగిశెట్టిపల్లి, కొల్తూర్, నారాయణపూర్, పోతారం, అనంతారం, లక్ష్మాపూర్, అద్రాస్‌పల్లి, ఎల్లగూడ, జగ్గంగూడ, సంపనబోలు, కేశవాపూర్ గ్రామాలు ఉండనున్నాయి.

పరిపాలన సాధ్యం కాదనే..

జిల్లాలోని 34 పంచాయతీల్లో పరిపాలన సాధ్యం కాదని జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు 'ఆంధ్రజ్యోతి' గతంలోనే చెప్పింది. ఈ 34 గ్రామాలను కూడా మున్సిపాల్టీలుగా ఏర్పాటు చేయాలని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపిన విషయాన్ని కూడా వెలుగులోకి తెచ్చింది. పరిపాలనలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున మున్సిపాల్టీలుగా మారిస్తేనే సౌకర్యంగా ఉంటుందని అధికారులు భావించారు. కాగా, జిల్లాలో గ్రామీణ పంచాయతీ వ్యవస్థలో పనిచేసేందుకు అధికారులు సైతం మొగ్గు చూపడం లేదు. డీపీవో, డీఎల్‌పీవో, కార్యదర్శులు, బిల్‌కలెక్టర్‌లు కూడా జిల్లా చిన్నదిగా ఉండటంతో పనిచేయడానికి ఆసక్తి చూపడం లేదు.

41 కి.మీ.. రూ.2,820 కోట్లు

(5వ పేజీ తరువాయి)

కన్సల్టెంట్ (పీఎంసీ) సేవలకు సైతం టెండర్లను ఆహ్వానించారు.

14 గ్రామాల ద్వారా..

నగరం నుంచి ఫ్యూచర్ సిటీకి అనుసంధానం చేస్తూ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును నిర్మించనున్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఆరు మండలాలు మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమన్‌గల్ పరిధిలోని 14గ్రామాల ద్వారా ఈ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మించనున్నారు. ఔటర్ ఎగ్జిట్-13 రావిర్యాల (టాటా ఇంటర్‌ఛేంజ్) నుంచి కొంగరఖుర్దు, కొంగరకలాన్, ఫిరోజ్‌గూడ, లేమూర్, తిమ్మాపూర్, రాచ్లూర్, గుమ్మడవెల్లి, పంజగూడ, మీర్‌ఖాన్‌పేట (ఫ్యూచర్ సిటీ) వరకు 18 కి.మీ., అక్కడి నుంచి ముచ్చెర్ల, కుర్మిద్ద, కడ్తాల్, ముద్విన్, ఆమన్‌గల్ మీదుగా ఆకుతోటపల్లి వద్ద రీజినల్ రింగ్‌రోడ్డుకు లింకు చేయనున్నారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు 916ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించారు. ఇందులో పట్టా భూములే 568 ఎకరాల వరకు ఉన్నాయి. ఈ భూముల సేకరణకు ఇప్పటికే రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఇక ఫారెస్టు భూములు, టీజీఐఐసీ భూములు, ప్రభుత్వ భూములను 348ఎకరాల వరకు సేకరించాల్సి ఉండగా.. పూర్తిస్థాయిలో వచ్చేసినట్లు తెలిసింది. ప్రైవేటు భూముల సేకరణలోనే ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ఇలా..!

- ఆరు లేన్ల ప్రధాన రోడ్డు మార్గం.. భవిష్యత్తులో ఎనిమిది లేన్లుగా పెంచేందుకు అనువుగా నిర్మాణం..
- 2ప్లస్ 2 మీటర్ల పచ్చదనంతో సెంట్రల్ మీడియన్‌లో మెట్రో లేదా రైల్వే కారిడార్ కోసం 20మీటర్ల వెడల్పుతో భూమిని రిజర్వు చేస్తారు. ● ఇరువైపులా మూడు లేన్ల సర్వీసు రోడ్డు..
- ఇరువైపులా రెండు మీటర్ల వెడల్పు గల గ్రీన్‌బెల్ట్
- ఇరువైపులా 3 మీటర్ల వెడల్పు గల సైకిల్ ట్రాక్
- ఇరువైపులా 2 మీటర్ల వెడల్పు గల ఫుట్‌పాత్
- ఇరువైపులా 2 మీటర్ల వెడల్పు గల యుటీటీటీ కారిడార్

ఒకే తరహాలో..

(5వ పేజీ తరువాయి)

పరిష్కరించే సమయాలను రియల్ టైం మానిటరింగ్ చేసుకోవచ్చని డిస్కం ఉన్నతాధికారులు చెబుతున్నారు.

సత్వర పరిష్కారానికి చర్యలు

వినియోగదారులకు మెరుగైన సేవలందించే లక్ష్యంతో ఒకే తరహాలో ఉండే ఆటోలను ప్రతిసెక్షన్‌లో అందుబాటులోకి తీసుకవస్తున్నాం. వేసవితో పాటు వర్షకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, లైన్ల వద్ద తలెత్తే సాంకేతిక సమస్యలతో సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుంటాయి. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే వాటిని నిమిషాల వ్యవధిలోనే పరిష్కరిస్తాం. ఆ దిశగా ఎఫ్ఓసీ ఆటోలను అప్‌డేట్ చేశాం. ఫ్యూజ్‌లతో పాటు సమస్యలు పరిష్కరించేందుకు అవసరమయ్యే పరికరాలు ఎఫ్ఓసీ ఆటోల్లో అందుబాటులో ఉంటాయి.

\- ముషారఫ్ ఫరూఖీ, సీఎండీ, టీజీఎస్పీడీసీఎల్

మణికొండలో రోడ్డుకు విముక్తి కల్పించిన హైడ్రా

ఆ వెంటనే మూసేసిన ప్రైవేట్ వ్యక్తులు

నార్సింగ్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆధ్వర్యంలో ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో బంధీగా ఉన్న రోడ్డుకు విముక్తి కల్పించారు. ఆ రోడ్డును తిరిగి సదరు వ్యక్తులు మూసేశారు. వివరాల్లోకి వెళ్తే.. మణికొండలోని హైటెన్షన్ విద్యుత్ తీగల కింద ఉన్న స్థలంతో పాటు నాలాను ఆక్రమించి ఏర్పాటు చేసిన రేకుల ప్రహరీని శనివారం హైడ్రా


కల్వర్టు వద్ద ర్యాంపు నిర్మించేందుకు ఏర్పాటు చేసిన మార్కింగ్

అధికారులు తమ సిబ్బందితో తొలగించే పనులు చేపట్టారు. రెండు రోజులు కిందట హైటెన్షన్ తీగల కింద ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదనే నిబంధనలను అతిక్రమించడంతోపాటు చారిత్రక బుల్కాపూర్ నాలాను కూడా ఓ నిర్మాణ సంస్థ కబ్జా చేస్తున్నదని స్థానికులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం శనివారం ఆక్రమణలను తొలగించే పనులు చేపట్టారు. మణికొండ మర్రిచెట్టు వద్ద ఓ నిర్మాణ సంస్థ నాలాను కలిపేసుకుని, హైటెన్షన్ విద్యుత్ తీగల కింద నిర్మాణాలు చేపట్టినట్లు నిర్ధారణ కావడంతో రేకుల ప్రహరీని హైడ్రా సిబ్బంది తొలగించారు. శంకర్‌పల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి ఖానాపూర్, కోకాపేట, నార్సింగ్, పుప్పాలగూడ, మణికొండ, దర్గా, షేక్‌పేట్, టోలిచౌకి, పోచమ్మబస్తీ, చింతలబస్తీ మీదుగా హుస్సేన్‌సాగర్‌కు వర్షపు నీరును తీసుకెళ్తున్న బుల్కాపూర్ నాలా పునరుద్ధరణతో చాలా ప్రాంతాలకు భూగర్భ జలాలు పెంచినట్టు అవుతుందని స్థానికులు హైడ్రా అధికారులను కోరారు. అలాగే, హుస్సేన్‌సాగర్‌కు వర్షపు నీటిని తీసుకువచ్చే ఏకైక నాలాగా దీనికి ప్రత్యేక స్థానం ఉందని స్థానికులు పేర్కొన్నారు. ఈ విషయంపై చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని



హైడ్రా కూల్చివేతలు

అధికారులు తెలిపారు.

మరోచోట..

మణికొండ, రాయదుర్గం మధ్యన పందెంవాగు నాలాపై ప్రజలకు కనెక్టివిటి కల్పించేందుకు జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సిబ్బంది పందెంవాగుపై కల్వర్టును నిర్మించారు. ఈ కల్వర్టుకు ఏర్పాటు చేసిన ర్యాంపు రోడ్డును సగం ఆక్రమించడంతో రోజూ


మూసివేసిన రోడ్డు

ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో హైడ్రా అధికారులు ఆ ర్యాంపును కూడా కూల్చివేశారు. అక్కడ కూడా రోడ్డుకు విముక్తి కల్పించారు. దీనిపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆ వెంటనే..

హైడ్రా అధికారులు వెళ్లిపోయిన కొద్దిసేపటికే మణికొండలో విముక్తి కల్పించిన రోడ్డుకు కొందరు వ్యక్తులు మళ్లీ అడ్డంకులు కల్పించారు. రోడ్డుపై రాకపోకలు అడ్డుకుంటూ ఇనుపరాడ్లు, పైపులు, కర్రలు, రాళ్ల రప్పలు ఏర్పాటు చేసి రోడ్డును తిరిగి మూసేశారు. ఇది తమ ప్రైవేట్ ప్రాపర్టీ అని వారు పేర్కొన్నారు. ఇక కల్వర్టుపై ర్యాంపును కూల్చివేసిన చోట తిరిగి ర్యాంపును నిర్మించేందుకు వెంటనే మార్కింగ్ ఏర్పాటు చేశారు. అర్ధరాత్రికి రెడిమిక్స్ ప్లాంట్‌లతో ఆ ర్యాంపు తిరిగి నిర్మిస్తామని అక్కడ కొంతమంది బిల్డర్లు పేర్కొంటుండడం చర్చనీయాంశంగా మారింది.


జగదాంబిక అమ్మవారి హుండీ లెక్కిస్తున్న ఈవో వసంత, శ్రీనివాస్, సర్వేశ్ తదితరులు

గోల్కొండ అమ్మవారి హుండీ లెక్కింపు

కార్వాన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ శ్రీ జగదాంబికా మహాకాళి అమ్మవారి హుండీని శనివారం లెక్కించారు. రూ.58,626 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.వసంత తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీనివాస్, ఆలయ పూజారి ఆర్.సర్వేశ్, బి.సురేశ్, ఆలయ వృత్తి పనివారి సంఘం అధ్యక్షుడు తంగడపల్లి శివశంకర్, సభ్యులు నవీన్‌కుమార్, కె.లీలావతి, ఎం.లక్ష్మి, జి.రాములు తదితరులు పాల్గొన్నారు.


వార్డు అధికారులతో డిప్యూటీ కమిషనర్ రవికుమార్

సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలి

- రాజేంద్రనగర్ డీసీ రవికుమార్

రాజేంద్రనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ తెలిపారు. శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఆస్తి పన్ను పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరికైనా ఆస్తి పన్ను ఎక్కువగా వచ్చినా, పేరు మార్చుకోవాలన్నా, ఇతర సమస్యలున్నా నేరుగా అధికారులను కలిసి పరిష్కరించుకునేందుకు ప్రతీ శనివారం ఆస్తిపన్ను పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆస్తి పన్ను బకాయిలు ఉన్నవారు ఈనెల 31లోగా పూర్తిగా చెల్లిస్తే వడ్డీలో 90 శాతం మినహాయింపు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వర్గీకరణ అమలు తర్వాతే ఉద్యోగాలు భర్తీ చేయాలి

అఫ్జల్‌గంజ్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చట్టం అమలులోకి వచ్చిన తర్వాతనే ఉద్యోగాలు భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌సీ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఆ సంఘం నాంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పూజలోల రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఇరిక శంకర్‌మాదిగ, కట్కూరి సంజయ్ కుమార్ మాదిగ, చోటా రమేశ్ మాదిగ, రోమాల సుధాకర్ మాదిగ, జమ్మి పరశురాం, జినుకుంట జగదీశ్ మాదిగ, మద్దూర్ కిరణ్‌మాదిగ, కొలిమి రాజ్‌కుమార్, కొమ్ము శ్రీకాంత్, మ్యాతరి మహేశ్, మల్యాల లక్ష్మణ్ మాదిగ, కనుకూరి యాదగిరి మాదిగ పాల్గొన్నారు.

ఆలయ కమిటీలో మరో ఇద్దరికి అవకాశం

చాంద్రాయణగుట్ట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కేశవగిరి శ్రీ స్వయంభూలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ కమిటీలో మరో ఇద్దరు సభ్యులను నియమిస్తూ దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ కమిటీలో ఏడుగురు సభ్యులు ఉండాల్సి ఉండగా, ఐదుగురు మాత్రమే ఉన్నారు. పి.బబిత, పి.మల్లికార్జున్‌గౌడ్‌ను సభ్యులుగా నియమించారు. వీరు త్వరలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


జల్‌పల్లి పెద్దచెరువులో మట్టి తొలగింపు పనులను పరిశీలిస్తున్న బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి


జల్‌పల్లి పెద్దచెరువులో మట్టి రోడ్డును ధ్వంసం చేస్తున్న ఎక్స్‌కవేటర్

జల్‌పల్లి పెద్దచెరువులో రోడ్డు ధ్వంసం

- ఆక్రమణలపై కదిలిన అధికారులు
- కబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు

పహాడీషరీఫ్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): 'కబ్జా చెరలో జల్‌పల్లి పెద్దచెరువు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.ఆక్రమణలపై ఎట్టకేలకు దృష్టి సారించారు. చెరువు మధ్యలో వేసిన రహదారిపై పోసిన మట్టిని ఎక్స్‌కవేటర్ల సాయంతో ధ్వంసం చేయించారు. ఇరిగేషన్ ఏఈ వీరేందర్ కుమార్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ జనార్దన్, బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి, డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, ఆర్ఐ మహ్మద్ జమీల్, మున్సిపల్ అధికారులు జల్‌పల్లి పెద్దచెరువును శనివారం సందర్శించారు. ఓ వాహనం ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని పహాడిషరీఫ్ పోలీసులకు అప్పగించారు. అక్రమ నిర్మాణాలను తొలగించి కబ్జాదారులపై పహాడిషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాలు కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వినియోగదారుల హక్కుల చట్టంపై అవగాహన కల్పించాలి

బర్కత్‌పుర. మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కుల చట్టంపై అన్నివర్గాల ప్రజలకు పూర్తి అవగాహన పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని అస్రా వ్యవస్థాపకులు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది హబీబ్ సుల్తాన్ అలీ డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ అండ్ అవర్నెస్ (అస్రా) ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కుల దినోత్సవంపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల చట్టం వచ్చి 35 సంవత్సరాలు నిండాయని, వినియోగదారులకు పూర్తి అవగాహన లేక అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో అస్రా రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వెంకటేష్‌గుప్తా, నేషనల్ లీగల్ కో-ఆర్డినేటర్లు హరికుమార్, శివకుమార్, కార్యదర్శి వీరేష్, ఉపాధ్యక్షులు శ్రీదన్య, ప్రశాంత్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హబీబ్ సుల్తాన్‌అలీ


ఐటీ కంపెనీ కిచెన్‌లో గ్యాస్ లీక్

- ఆరుగురికి గాయాలు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమణగౌడ్

నార్సింగ్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కోకాపేట్‌లోని ఓ ఐటీ కంపెనీ కిచెన్‌లో జరిగిన ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కోకాపేట్‌లోని ఘర్ టవర్‌లో ఓ ఐటీ కంపెనీకి సంబంధించిన కిచెన్ ఏర్పాటు చేస్తున్నారు. దీని నిర్మాణంలో భాగంగా గ్యాస్ సిలిండర్ బిగిస్తుండగా, గ్యాస్ లీకైంది. దీంతో అక్కడ పనిచేస్తున్న వారంతా బయటకు పరుగెత్తుకొనిరాగా, ఆరుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో యజమాని రాకేశ్, రిజ్వాన్, అన్వర్ మాలిక్, శివ, ఫారుక్ మాలిక్, కె.రాజు ఉన్నారు. వీరంతా ప్రస్తుతం కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అక్కడ వ్యాపించిన మంటలను సీజ్ ఫైర్‌తో కొంత, అగ్నిమాపకశాఖ సిబ్బంది కొంతమేర చల్లార్చారు. అగ్నిప్రమాదం జరగలేదని ఏసీపీ రమణగౌడ్, నార్సింగ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ప్రకటించడం గమనార్హం.


రాజేంద్రనగర్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న హైదరాబాద్ ఎంపీ, మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ, శాసనమండలి సభ్యులు మీర్జా రహ్మత్‌బేగ్, నిర్వాహకులు మహ్మద్ ముర్తుజా అలీ తదితరులు


చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు ఉమామహేంద్ర తదితరులు ● చార్మినార్, ఆంధ్రజ్యోతి

రాజ్యాధికారం ద్వారానే అణగారిన వర్గాలకు మేలు

రాజేంద్రనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారం ద్వారానే అణగారిన వర్గాలకు మేలు జరుగుతుందని నమ్మి ఆ సిద్ధాంతాన్ని ఉత్తరప్రదేశ్‌లో ప్రవేశపెట్టి విజయం సాధించిన గొప్ప నేత దివంగత కాన్షీరాం అని పలువురు దళిత సంఘాల నాయకులు కొనియాడారు. రాజేంద్రనగర్ సర్కిల్ మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు ఎడ్లకాడి సూర్యం ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ అంబేడ్కర్ చౌరస్తాలో కాన్షీరాం జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ వి.శ్రీరాములు, పి.జీవన్‌దాస్, వనం నర్సింహ, గోల్కొండ రాజు, పచ్చ శ్రీనివాస్, పంబాల రాజు, మంత్రి చంద్రశేఖర్, పచ్చ నర్సింగ్‌రావు, దాసరి రమేశ్, మంగళారం శ్రీనివాస్, గొడుగు సంజీవ, వీర్లపల్లి నవీన్, పత్యార నర్సింహ, బండారి సుదర్శన్, గోల్కొండ యాదయ్య, ఎ.బాబురావు, ఎడ్లకాడి చంద్రశేఖర్, బర్ల సుమన్, కె.గౌతమ్, ఎ.అనిల్‌కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.


కాన్షీరాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు


ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ ప్రభంజన్ కుమార్ యాదవ్

బీసీల నాయకత్వం అవసరం

హిమాయత్‌నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బహుజన రాజ్యాధికారానికి బీసీల నాయకత్వం అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం కాన్షీరాం జయంతిని పురస్కరించుకుని నగరంలోని డిక్కీ సమావేశ మందిరంలో సామాజిక న్యాయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రభంజన్ కుమార్ యాదవ్ అధ్యక్షతన 'ప్రత్యేక వనాయుబహుజన రాజకీయ పార్టీ అనివార్యం' అనే అంశంపైన 101 మంది మేధావులతో సమావేశం జరిగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఐక్యతతో బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ననుమాస స్వామి, ప్రొఫెసర్ వెంకటదాస్, డాక్టర్ ప్రవీణ్, తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ అవుల వెంకటేశ్వర్లు, బత్తుల సిద్దేశ్వర్, రోజా నేత తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/5mzHqhjలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.


తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వెంకటేశ్వరస్వామిని కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ● రాజేంద్రనగర్, ఆంధ్రజ్యోతి

బాలకృష్ణ గురుస్వామి పాదయాత్రకు మద్దతు

చాంద్రాయణగుట్ట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గోమాత విశిష్టతను తెలియజేస్తూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేస్తున్న బాలకృష్ణ గురుస్వామిని కాంగ్రెస్ పార్టీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గ ఇన్‌చార్జి బోయ నగేశ్ కేరళలో మర్యాద పూర్వకంగా కలిసి మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈనెల 27న పాదయాత్ర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేయనున్న మహాసభను విజయవంతం చేయాలని కోరారు.


బాలకృష్ణ గురుస్వామితో బోయ నగేశ్


పారిశుధ్య కార్మికులకు మద్దతుగా ధర్నాలో పాల్గొన్న నిజాం కళాశాల విద్యార్థులు

పారిశుధ్య కార్మికుల వేతనాలు విడుదల చేయాలి

బర్కత్‌పుర, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నిజాం కళాశాల వసతి గృహంలో పనిచేస్తున్న పారిశుధ్య సిబ్బందికి వెంటనే వేతనాలు విడుదల చేయాలని సిబ్బంది రాజు, వజ్రమ్మ, రేణుక, అండాలు, జ్యోషెఫినా, మౌనిక, లార్డరస్ డిమాండ్ చేశారు. ఆరు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, దీనివల్ల తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశుధ్య కార్మికులు పనులు నిలిపేయడంతో వసతిగృహంలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుందని విద్యార్థులు ఆందోళన చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి

బర్కత్‌పుర, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మదర్స్ అసోసియేషన్, దళిత బహుజన ఫ్రంట్, ఎంవీ ఫౌండేషన్, సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సదస్సులో ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, వెంకట్‌రెడ్డి, కన్నెగంటి రవి, శంకర్, ప్రసన్న, హరికృష్ణ మాట్లాడారు. దేశంలో విద్యారంగానికి బడ్జెట్‌లో సగటున 15శాతం నిధులు కేటాయిస్తుంటే తెలంగాణలో కేవలం 7.3 శాతం కేటాయిస్తున్నారని తెలిపారు. బడ్జెట్ లేక ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయని, నిరుపేద విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమవుతున్నారని ఆరోపించారు.

రేపటి నుంచి కుష్ఠువ్యాధి నిర్ధారణ పరీక్షలు

రాజేంద్రనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రేపటి నుంచి 30వ తేదీ వరకు రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా కుష్టు వ్యాధి పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం శివరాంపల్లిలోని రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్టువ్యాధి గుర్తింపు ఉద్యమంలో పాల్గొనే జిల్లా స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు ఉదయం 9గంటలలోపు వారికి కేటాయించిన ప్రాంతాల్లో కుష్టు వ్యాధి లక్షణాలపై సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఎం డాక్టర్ పాపారావు, జిల్లా పారా మెడికల్ అధికారి సులోచన తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మృతి

రాజేంద్రనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): హైదర్‌గూడకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, పోచమ్మ ఆలయం ధర్మకర్త చెట్టిగారి వసంతరావు(80) శనివారం తన నివాసంలో మృతిచెందారు. పలువురు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. హైదర్‌గూడ మూసీనది ఒడ్డున గల శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.


వసంతరావు(ఫైల్)

సీఎం రేవంత్‌రెడ్డిపై ఫిర్యాదు

అఫ్జల్‌గంజ్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు శనివారం షాహినాయత్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గోషామహల్ నియోజకవర్గ నాయకుడు ఆశిష్‌కుమార్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు, ప్రధానకార్యదర్శి కొల్లా ప్రదీప్, ఉపాధ్యక్షులు రాంప్రసాద్, విజయ్ ముదిరాజ్, దశరథ్, విజయ్, హరికృష్ణ, రామన్ భాయ్, అనిల్‌కుమార్, విష్ణువర్ధన్, చేతన్ తివారి, అజర్ భాయ్, ఫిరోజ్‌ఖాన్, ఇమ్రాన్‌ఖాన్, చందర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 14 నుంచి మహాభూమి రథయాత్ర

బర్కత్‌పుర, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపనే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఇంటికి సాగనంపడమే ధ్యేయంగా ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి రోజు నుంచి మహా భూమి రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ తెలిపారు. అదిలాబాద్‌లో యాత్ర ప్రారంభమై 2028 జూలై 11న హైదరాబాద్ జింఖాన గ్రౌండ్‌లో భారీ బహిరంగసభతో ముగుస్తుందని ఆయన తెలిపారు. శనివారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రథయాత్ర 33 జిల్లాలు, 612 మండలాలు, 12వేల గ్రామాల్లో కొనసాగుతుందని తెలిపారు.

19న చలో పార్లమెంట్

బర్కత్‌పుర, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థలు, విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు కోరుతూ ఈనెల 19న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తెలిపారు. శనివారం కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో అఖిలపక్ష ఎంపీల మద్దతు కూడగట్టడానికి చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.